www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 నవంబర్ 2022
5

వైఎస్ఆర్

ఎన్నికల పరిశీలకులకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశమైన ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్నకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. ప్రకటించిన ఓటర్ల జాబితా అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అక్రమాలను అరికట్టి పూర్తిగా పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 9 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

మంత్రికి మతిభ్రమించినట్లుంది : యుటిఎఫ్

నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు మతిభ్రమించినట్లు ఉందని యుటిఎఫ్ నాయకులు విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే కాళ్లు పట్టుకోవాలని వ్యాఖ్యానాలకు వ్యతిరేకంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నిర్వహించిన ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే రాజకీయ నాయకుల కాళ్లు పట్టుకోవాలనడం చూస్తే మంత్రికి మతిభ్రమించి మాట్లాడినట్లు అనిపిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర దేశ చరిత్రలో హక్కులన్నీ పోరాటం చేసి సాధించుకున్నావే తప్ప పైరవీలు చేయడం చరిత్రలో లేదని గుర్తెరిగి మాట్లాడాలన్నారు. ఒక అత్యున్నత మంత్రి పదవిలో ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దురహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నిక కాబడిన ప్రభుత్వాలు ప్రజలలో భాగస్వాములైన ఉద్యోగులు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యానాలు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అవమానం చేయడమేనని అన్నారు. మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సుజాత రాణి, జిల్లా కార్యదర్శి రావుద్దీన్, విద్యా వికాస వేదిక కన్వీనర్ రాజశేఖర్ రాహుల్, ఆడి కమిటీ కన్వీనర్ ప్రభాకర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఉషా తులసి, సుబ్బారెడ్డి, యూటీఎఫ్ నాయకులు కరీముల్లా, కిరణ్ కుమార్, సి.వి. రమణ, శ్రీకాంత్, జావీద్, ఎస్ఎం బాషా, నరసింహ శాస్త్రి, చంద్రమోహన్, రవికుమార్, పుష్పరాజు, సరస్వతి, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, రంగనాయకులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ, సిటీ అధ్యక్షుడు ఓబులేసు, కార్యదర్శి షాకీర్ పాల్గొన్నారు.

పంట రుణాల రాయితీతో రైతులకు ధీమా

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలు రైతుల్లో కొండంత ధీమాను పెంచుతుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2020-21 రబీకి సంబంధించి, 2021ఖరీఫ్ కాలానికి వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకాలు, 2022 ఖరీఫ్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ కింద లబ్ధి మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యమంత్రితో మాట్లాడుతూ వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల పథకం ద్వారా 2020-22 రబీ సీజన్‌కు సంబంధించి లక్ష లోపు పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 12,112 మంది రైతులకు మంజూరైన రూ.2.69 కోట్లు, 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 24,920 మంది రైతులకు రూ.6.05 కోట్ల లబ్ధి మొత్తం వారి బ్యాంకు ఖాతాలకు జమ అయిందన్నారు. 2020 ఖరీఫ్ సీజన్ సున్నా వడ్డీ కింద 30,233 మంది జమకాని రైతులకుగానూ రూ.7.30 కోట్లు జమ చేయగా, మొత్తంగా జిల్లాలో 67,265 మంది రైతులకు రూ.16.04 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. 2022 ఖరీఫ్ కాలానికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు సత్వర ఉపశమనం కల్పిస్తూ ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్‌లో పరిహారాన్ని అందించడంలో భాగంగా మైదుకూరు మండలంలో 21.86 హెక్టార్లలో నష్టపోయిన 28 మంది వరి రైతులకు, కమలాపురం మండలంలో 125.13 హెక్టార్లలో నష్టపోయిన 318 మంది వరి రైతులకు, 1761.27 హెక్టార్లలో నష్టపోయిన 2141 మంది ఉల్లి రైతులకు రూ.2.8302 కోట్లు నష్టపరిహారం జమ చేయడం జరిగింది. పులివెందులలో 908.59 హెక్టార్లలో, జమ్మలమడుగులో 76.002 హెక్టార్లలో దెబ్బతిన్న ఉల్లి రైతులకు రూ.1.4799 కోట్లు జమ చేయగా మొత్తంగా జిల్లాలో 2893.175 హెక్టార్లకు గాను 3855 మంది రైతులకు రూ.4.3399 కోట్లు రైతుల ఖాతాలో జమ అయిందని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం స్థానిక విసి హాలులో సున్నా వడ్డీ పథకం, ద్వారా జిల్లాలో లబ్ధి పొందిన 12,112 మంది రైతులకు మంజూరైన రూ.16.04. కోట్ల మెగా చెక్కును, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా లబ్ధి పొందిన 3,855 రైతులకు మంజూరైన 4.3399 మెగా చెక్కులను మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పి.శివప్రసాద్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఆప్కాబ్ ఛైర్మన్ మల్లెల ఝాన్సీరాణి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జాయింట్ కలెక్టర్ సిఎం సాయి కాంత్ వర్మ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి సభ్యులు ఎ.వేణుగోపాలరెడ్డి, బలరామిరెడ్డి, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు, పశు సంవర్ధకశాఖ జెడి శారదా, డిసిఒ సుభాషిని, వ్యవసాయశాఖ ఎడిలు నరసింహారెడ్డి, సుబ్బారావు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయ్ రామరాజు

యుద్ధప్రాతిపదికన గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పేదలందరికీ జగనన్న గృహ నిర్మాణ పథకం, ప్రాధాన్యత భావన నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతంగా, యుద్ధప్రాతిపదికన చేసి లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించిన గృహనిర్మాణ శాఖ సమీక్షా సమావేశంలో జగనన్న కాలనీలు, ప్రయారిటీ బిల్డింగుల నిర్మాణ పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఒటిఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్ పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాపై మండల, నియోజకవర్గ స్థాయిల ప్రత్యేక , హౌసింగ్ ఇంజినీర్ అధికారులతో నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు కార్యక్రమం, పౌర సేవలు, సంక్షేమ పథకాల ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేష్ లు, హౌసింగ్ పీడీ కృష్ణయ్య తో పాటు అనుబంధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధి కారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : అరుంధతి నగర్‌కు చెందిన తూపల్లె యల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారాన్ని వైసిపి యువ నాయకులు పెడబల్లె ప్రదీప్‌కుమార్‌రెడ్డి వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం రవీంద్రనాథ్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

యువజనోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

కడప : డిసెంబర్ 7న నిర్వహించబోయే జిల్లాస్థాయి యువజనోత్సవాలు-2022 పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో కలెక్టర్ విజయ్ రామరాజు, జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, స్టెప్ సీఈవో సి సాయి గ్రేస్ ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. 15-29 సంవత్సరాల వయసులోపు గల డిసెంబర్ 4వ తేదీ లోపల https://bit.ly/YSRKDP ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

వల్లూరు: అండర్ - 19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారిని నసీం మునిష తెలిపారు. సోమవారం ఎస్‌టి జోసెఫ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ - 19 ఫుట్‌బాల్ క్రీడల్లో తమ క్రీడా ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాలకు చెందిన సి రెడ్డమ్మ , అఖిలేశ్వరి, దివ్యశ్రీ ,వైశాలి , శారద విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. వారు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎలాంటి ఫిర్యాదులైనా చేయొచ్చు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న ఆర్ఎం మరళీమోహన్

అంబుడ్స్‌మెన్ స్కీం ద్వారా ఎలాంటి ఫిర్యాదులైన చేయవచ్చునని కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. కెనరా బ్యాంక్ కడప ఆధ్వర్యంలో సోమవారం రిజర్వ్ బ్యాంకు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ స్కీం జాతీయ విస్తృతస్థాయి సదస్సు ప్రొద్దుటూరు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలో అన్ని బ్యాంకుల అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు. రిజర్వ్ బ్యాంకు కేంద్ర కార్యాలయంలోని వినియోగదారుల అవగాహన, రక్షణ శాఖ (సిఇపిడి) ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆర్థిక వినియోగదారుల హక్కులు, అంతర్గత పరిష్కార విధానం, ప్రత్యామ్నాయ పరిష్కార విధానా మీద అవగాహన కల్పించుటకు ఆర్‌బిఐ ఈ సదస్సులను చేపట్టిందని తెలిపారు. ఎపిజిబి ఆర్ఎం పి.శ్రీదేవి మాట్లాడుతూ కార్డు ఉపయోగించకుండా ఎటిఎం ద్వారా నగదు తీసుకునే విధానాన్ని ఉపయోగించడం ద్వారా కార్డు దుర్వినియోగాన్ని అరికట్టవచ్చున్నారు. కార్యక్రమంలో నాబార్డు డిబిఎం విజయ్ విహారి, మెప్మా పీడీ రాంమోహన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి, కడప జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గాప్రసాద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

లిఖిత రాజ్యాంగం పట్ల గర్వపడాలి

కడప : భారత రాజ్యాంగం అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, ఒక లిఖిత రాజ్యాంగం కలిగి ఉన్న దేశంగా గర్వపడాలని సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్.కవిత పేర్కొన్నారు. రాజ్యాంగ వారం వేడుకలు సందర్భంగా సోమవారం న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఖాజీపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కడప నగరం 7 రోడ్ల కూడలిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు, ర్యాలీలు, న్యాయ విజ్ఞాన సదస్సు లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు.

ఉర్దూను రెండవ భాషగా అమలు చేయాలి

కడప : ఉర్దూను రెండవ భాషగా అధికారికంగా అమలు చేయాలని కోరుతూ 'కరువన్ ఇ ఉర్దూ సంస్థ' ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇస్మాయిల్, ఎస్‌కె నసీరుద్దీన్, నజీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలలో ఉర్దూ భాషను రెండవ భాషగా అధికారికంగా ప్రభుత్వం అమలు పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ యాక్ట్ 8ను ఈ ఏడాది ఏప్రిల్ 25న విడుదల చేసిందన్నారు. దాదాపు 8 నెలలు కావస్తున్నా ఇంతవరకు మన జిల్లాలో అమలు కావడంలేదన్నారు.

తహశీల్దార్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

-భూమి ఇప్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రైతును అడ్డుకుంటున్న కార్యాలయ సిబ్బంది

స్థానిక మండల పరిధిలోని రామాపురం చెందిన కొత్తూరు సామేలు అనే రైతు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎదుట గడ్డికోసే కొడవలితో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. అక్కడ ఉన్నవారు అడ్డుకోవడంతో ప్రయత్నాన్ని విరమించాడు. వివరాలు.. కొత్తూరు సామేలు పెద్ద శెట్టిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల వెనుక భాగంలో 1.64 సెంట్లు విస్తీర్ణం గల భూమిని తన తండ్రి హయాం నుంచి అనుభవిస్తున్నారు. గుద్దేటి వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా తన భూమిని ఆక్రమించుకుని వన్ బి అడంగల్ పుట్టించుకున్నాడని వాపోయారు. పలు కార్యాలయాలు తిరిగినా న్యాయం జరగలేదని, తన భూమి స్వాధీనం చేయాలని లేకపోతే ఆత్మ హత్య చేసుకుంటానని తహశీల్దార్ ఎదుట కొడవలితో ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడ ఉన్నవారు అతన్ని అడ్డుకున్నారు. తహశీల్దార్ వెంటనే స్పందించి తన విధులకు ఆటంకపరచిన అతని ఆత్మహత్య కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప అర్బన్ : 2021-22 సంవత్సరానికి జిల్లా స్థాయి ఉత్తమ యువజన సంఘం అవార్డు పురస్కారం కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర, జిల్లా యువ అధికారి కె. మణికంఠ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువజన సంఘాలు గ్రామాల్లో 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు విద్య, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, వృత్తి శిక్షణ, వరకట్న, అంటరానితనం నిర్మూలన, ట్రీ ప్లాంటేషన్, హెల్త్ అండ్ ఫామిలీ, స్పోర్ట్స్, కల్చరల్, జాతీయ సమైక్యత, కరోనా వ్యాధి పై అవగాహనా వంటి కార్యక్రమాలపై ఫొటో ప్రెస్ క్లిప్పింగ్‌తో సహా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 8లోపు తమ కార్యాలయానికి పంపాలని చెప్పారు. గెలుపొందినిన ఉత్తమ సంఘమునకు రూ. 25 వేలు నగదు బహుమతి తోపాటు ప్రశంస పత్రం అందజేస్తామని తెలిపారు.

యువత క్రమశిక్షణ పాటించాలి

కడప అర్బన్ : యువత క్రమశిక్షణ పాటించాలని, చెడు అలవాట్లకులోను కావద్దని ప్రముఖ వైద్యులు డాక్టర్ మహబూబ్ పీర్, సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఛైర్మన్ బుచ్చుర్ ఆరీఫుల్లా సూచించారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎంఎం హాస్పిటల్లో రాయల్ రషీద్ సేవా సంస్థ అధ్యక్షుడు రాయల్ కరిముల్లా ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితం ఉన్నతమైందని పేర్కొన్నారు. ఆకర్షణలకు లోనై యువత జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని సూచించారు.

వైద్య విద్యార్థులను సమర్థులుగా తీర్చిదిద్దాలి

రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

ప్రజాశక్తి-కడప సిటీ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిమ్స్ ప్రిన్సిపల్

వైద్య విద్యార్థులను వైద్యశాస్త్రంలో సమర్థులైన పట్టభద్రులుగా తీర్చిదిద్దాలనే ప్రధాన లక్ష్యంతో జాతీయ వైద్య సంస్థ పునర్వ్యవస్థీకరించబడిన వైద్య విద్యా విధానాన్ని రూపొందించిందని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ పేర్కొన్నారు. సోమవారం రిమ్స్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధనా విధానాల అభివృద్ధితో ప్రస్తుతమున్న మెడికల్ కళాశాలల నాణ్యత పెరుగుతుందని చెప్పారు. అకడమిక్ కెరీర్‌లో యువ వైద్యులను మరింత సమర్థవంతంగా తీర్చిద్దాడానికి దారి తీస్తుందని తెలిపారు. ప్రతి వైద్యులు నైతికంగా ప్రతిస్పందించేలా, జవాబుదారీగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య విద్య విభాగం కో-ఆర్డినేటర్ కె.పి. వరలక్ష్మి, సహాయ ప్రధానాచార్యులు లక్ష్మీబాయి, ఉప సంచాలకులు, ఫోరెన్సిక్ విభాగాధిపతి ఎం. శ్రీనివాస్ నాయక్, ప్రకాష్ పల్గొన్నారు.

రైతులకు పంటల బీమా చెల్లించాలి

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే చెల్లించాలని టిడిపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు శివారెడ్డి, హరి ప్రసాద్ మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతు దగా ప్రభుత్వంగా అభివర్ణించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

బస్సులను ప్రారంభించిన ఛైర్మన్

కడప అర్బన్ : విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్తగా ఆర్టీసీ స్టార్ లైనర్ బస్సులను కడప ఆర్టీసి డిపోలో సోమవారం ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ స్టార్ స్లీపర్ బస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. త్వరలో ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

జాతి అభ్యున్నతికి మార్గదర్శి జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి - కడప అర్బన్



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న గోవిందు నాగరాజు, కార్పొరేటర్ ఉమాదేవి

జాతి అభ్యున్నతికి బాటలు వేసిన మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే అని బి.సి. సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బుర్రి రెడ్డయ్య యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పీర్ల గంగాధర్ యాదవ్, మేకల వెంకటేష్ యాదవ్, బిసి నాయకులు రమణ, అవ్వారు రామ్మోహన్, రమేష్ బాబు అన్నారు. **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..**

కడప : మహిళా అభ్యుదయానికి బాటలు వేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పూలే 132వ వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ శ్రేణులు బిసి సెల్ జిల్లా ఛైర్మన్ నూకల చిన్న కులాయప్ప ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, పాత బస్టాండ్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, పిసిసి డెలిగేట్స్ నజీర్‌అహ్మద్, తిరుమలేష్, రాష్ట్ర ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షుడు మల్యాం విజయభాస్కర్, రాష్ట్ర బిసి కో-ఆర్డినేటర్లు నాగరాజు, గాడ్ల కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఆరిఫ్ల, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, మామిళ్ల బాబు, శివ, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య, లోకేశ్వరి, బండ ఎరుకలయ్య, సుశీల్ కుమార్ పాల్గొన్నారు. **వైసిపి జిల్లా కార్యాలయంలో..** ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, మహిళా నగర అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. **జిల్లా బిసి విభాగం అధ్యక్షులు బంగారు నాగయ్య ఆధ్వర్యంలో..** నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువ నాయకులు అహ్మద్‌బాషా, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...**జ్యోతిరావుపూలే 132వ వర్ధంతి సందర్భంగా జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, గోవిందు నాగరాజు, సిఆర్ఐ సునీల్ జయంత్, బంగారు నాగయ్య, శివయాదవ్, కాదర్‌బాషా, సుంకేసుల వెంకటేశ్వర్లు, నారాయణమ్మ, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, అంజి, సాయికుమార్, త్రివిక్రమ్‌రావ్, పస్తం అంజి పాల్గొన్నారు.

పూలమాల వేస్తున్న మాసా కోదండరామ్

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-కడప అర్బన్

కార్యక్రమ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

బేస్ లైన్ పరీక్ష ఆధారంగా వెనుకబడిన విద్యార్థులలో సామర్థ్యాలను మెరుగుపరచాలని శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని చెమ్ము మియాపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్ఐపి మెటీరియల్ లాంచింగ్ కార్యక్రమాన్ని ఎస్-ఎస్ఎ పిఒ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిఇఒ దేవరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో కరోనా కారణంగా సామర్థ్యాలు తగ్గి చదువులో వెనుకబడిపోయారని చెప్పారు. వాటిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లర్నింగ్ ఇంప్లిమెంట్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని 6 7 8 తరగతి లకు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సామర్థ్యాలను పెంపొందించాలని ఆదేశించారు.. అనంతరం ఎస్-ఎస్ఎ పిఒ, డిఇఒ ఎల్ఐపి కార్యక్రమం ఆవశ్యకతను, పాఠశాలలో తరగతి గదిలో ఆచరించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామాంజనేయులురెడ్డి, ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

హత్యా రాజకీయాలు ప్రోత్సహించడం సిగ్గు చేటు

కడప అర్బన్ : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం సిగ్గుచేటని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు అన్నారు. సోమవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్య సాయి జిల్లా రాప్తాడు శాసనసభ్యుని తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేసులను ఇంట్లోకి పోయి చంపే వారేమని మాట్లాడితే ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం దారుణమన్నారు **వన్ టౌన్ లో ఫిర్యాదు..** టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పై రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి బ్రదర్స్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

'బొత్స' దృష్టికి డిఇఒ పూల్ సమస్య

ప్రజాశక్తి- కడప అర్బన్

వినతి పత్రం అందజేస్తున్న స్లాట్ నాయకులు

డిఇఒ పూల్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని స్లాట్ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, కోశాధికారి భోగా గంగాధర్ కోరారు. సోమవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 జిల్లాల భాషోపాధ్యాయుల రాష్ట్ర సమావేశం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీసుకోవలసిన వ్యూహాలు, సంస్థ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. గుంటూరు జిల్లా సీనియర్ నాయకులు విశ్రాంత ఉపాధ్యాయులు రమణబాబుని ఘనంగా సన్మానించారు.కడప, కర్నూల్, అనంతపురం ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని ఏక తీర్మాణంతో ఆమోదించామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చెన్నూరు

భూమిపూజ చేస్తున్న ఎంఎల్ఎ రవీంద్రనాథరెడ్డి

కొత్త రోడ్డు నుంచి పాత రోడ్డు వరకు, రోడ్డు వెడల్పులో భాగంగా దాదాపు కోటి రూపాయలతో ఆ పనులకు శ్రీకారం చుట్టామని కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డితో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మండల అభివృద్ధిలో భాగంగా కొత్త రోడ్డు నుంచి రామాలయం వరకు రూ.34 లక్షలతో సిసి రోడ్లను నిర్మించనున్నామని చెప్పారు. రూ. 64 లక్షలతో చెన్నూరు కొత్త రోడ్డు నుంచి వనం వీధి వరకు డ్రెయినేజీ పనులు చేపట్టామని పేర్కొన్నారు. పనులన్నీ పూర్తయితే ప్రజలకు డ్రెయినేజీ సమస్యతోపాటు రోడ్లపై ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండదని తెలిపారు. ఇందుకు సంబంధించి ఒక సైడు మాత్రమే డ్రెయినేజీ పనులు చేపడతారని మిగతా ప్రక్కన ఉన్న ఇంటి వారు డ్రెయినేజీకి సంబంధించిన పైపులను వేసుకున్న తరువాతే రోడ్డు పనులు చేపడుతామని చెప్పారు. దీంతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.వి.ఎస్.ఆర్, మండల ఉపాధ్యక్షులు ఆర్‌వి ఆర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ ప్రతాపరెడ్డి, ఎర్ర సాని మోహన్ రెడ్డి, మండల కో - ఆప్షన్ నెంబర్ వారిష్, సర్పంచులు, సిద్దిగారి వెంకటసుబ్బయ్య, తుంగ చంద్రశేఖర్ యాదవ్, సొంతం నారాయణరెడ్డి, ఎంపిటిసిలు నిరంజన్ రెడ్డి, సాధిక్ అలీ, దుంప నాగిరెడ్డి, చంద్ర పాల్గొన్నారు. **ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు..** అభివృద్ధి- సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. సోమవారం వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.వి. ఎస్.ఆర్. నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడూ సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ప్పటికే మండలంలో సంక్షేమం- అభివృద్ధి పనుల కింద రూ.113.652 కోట్లను ఖర్చు చేశారని తెలిపారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - వల్లూరు

యాచకుడికి దుప్పటి అందజేస్తున్న ఎస్ఐ

కమలాపురం రైల్వేగేట్, దర్గా ఆవరణం, రైల్వేస్టేషన్, ప్రధాన క్రాస్‌రోడ్డు వద్ద నిద్రిస్తున్న యాచకులకు, నిరాశ్రయులకు మదర్‌థెరిస్సా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్న పెద్దయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చలికాలంఓ ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ జూటూరు విజయ్ కుమార్ తెలిపారు ప్రతి ఏడాది లాగానే ఈ సారి దాతల సహకారంతో నాణ్యమై దుప్పట్లు అభాగ్యులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మదర్‌థెరిసా ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు విగ్నేష్ , ఇన్నయ్య(చిట్టి) , రాము, మౌలా షరీఫ్, గణేష్, ఉపాధ్యాయుడు సాంబశివుడు, రైల్వే స్టేషన్ మాస్టర్ బిల్ మీనా పాల్గొన్నారు.

రూ.1.30 లక్షలు పలికిన లడ్డూ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ మిట్ట మల్లేశ్వర దేవస్థాన ఆలయంలో అయ్యప్పస్వామి మండల పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి దగ్గర ఉంచిన లడ్డూను వేలం వేయగా.. తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గజ్జల అనూష మహేశ్వర్‌రెడ్డి సర్పంచు రూ.1,30,000 దక్కించుకున్నారు. రూ.15 వేలకు జ్యోతి లడ్డూను మెడికల్ స్టోర్ రాజా దక్కించుకున్నారు. అనంతరం వ్యాపారవేత్త భద్రంపల్లెకు చెందిన మధు మండలపూజ సందర్భంగా ఎనిమిది వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ హుస్సేన్, ఎఎస్ఐ స్వామి, సిబ్బంది పర్యవేక్షించారు. లయోలా డిగ్రీ కాలేజి ఎన్‌సిసి విద్యార్థులు సహకారాలను అందించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తి మండలి సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, టెంకాయల శీను, అయ్యప్ప భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

లడ్డూ తీసుకెళుతున్న మహేశ్వర్‌రెడ్డి

మోటరుకు మరమ్మతులు చేపట్టండి

- ఎంపిటిసి పద్మా రాజకుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఆంధ్రాబ్యాంకు సమీపంలో ఉన్న తాగునీటి మోటర్ పంపునకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని ఎంపిటిసి పద్మా రాజకుమార్ కోరారు. మోటర్ పంపును సోమవారం ఆయన పరిశీలించారు. గరుగువీధి ప్రాంతానికి తాగునీటి సరఫరా చేసేందుకు బోరును వేశారని, కొద్ది రోజులుగా బోరు వద్ద ఉన్న పంపు లీకేజీ అవుతోందన్నారు. దీంతో తాగునీరు వృథా అవుతోందని తెలిపారు. ఈ ప్రాంతం చిత్తడిగా తయారవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించాలన్నారు. బోరు వద్ద చెత్తను కూడా తొలగించాలని కోరారు.

నీటి వృథాను పరిశీలిస్తున్న ఎంపిటిసి

చదరంగంలో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప మున్సిపల్ గ్రౌండ్ మైదానంలో డిఎస్‌సి ఆధ్వర్యంలో ఎస్‌జిఎఫ్ఐ నిర్వహించిన జిల్లాస్థాయి చదరంగం అండర్-19 క్రీడా పోటీల్లో బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.చంద్రాయుడు (బై.పి.సి) ప్రథమ స్థానం సాధించగా, వి.ఓబుల్‌రెడ్డి (ఎం.పి.సి) ద్వితీయ స్థానంలో జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదరంగం పట్ల చూపిన తెలివితేటలు, మక్కువను కొనియాడారు. చదరంగం ఆట ఆడాలంటే ఎంతో నైపుణ్యం, మేధాశక్తి, ఏకాగ్రత ఉండాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతా, కాలేజి ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చిన్నయ్య, కె.అంజి, డి.రమేష్‌ను అభినందిస్తూ సత్కరించారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మైదుకూరులో సిడిపిఒ కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి నియోజకవర్గం కేంద్రం మైదుకూరులో సిడిపిఒ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎపి ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు జె.గంగావతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అంగన్వాడీ సిబ్బంది సమావేశాలకు వెళ్లాలంటే వ్యయ,ప్రయాసా లకు గురికావాల్సి వస్తోందని తెలిపారు. మైదుకూరులో సిడిపిఒ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఉన్నత అధికారులు అంగన్వాడీ కేంద్రాల సందర్శన సులభతరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే మైదుకూరులో సిడిపిఒ కేంద్రం ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం తగదు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సాహించడం శోచనీయమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హత్యా రాజకీయాలకు నాందిగా పేర్కొన్నారు. ఇలాంటి వైసిపి నాయకులకు మళ్లీ అధికారం ఇస్తే రాజకీయ హత్యలు పెరిగి పోయే అవకాశం ఉందన్నారు. హత్యా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్న వైసిపి నేతలపై సిఎం జగన్ చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడం చూస్తే పరోక్షంగా వాటిని ప్రోత్సహించడమే అవుతుందని పేర్కొన్నారు. సిఎం జగన్ అండదండలు చూసుకొని వైసిపి నాయకులు రెచ్చిపోతున్నట్లు తెలిపారు. సామాన్యులపైన, ప్రతిపక్ష నాయకులపైన కఠినంగా వ్యవహరించే పోలీసులు మౌనంగా ఉండడం బాధాకరమన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు పివి రమణ, ఐ టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి గోటూరు నాగభూషణం, మండల ఉపాధ్యక్షుడు వీర భద్ర, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇదాయతుల్లా, మండల మైనార్టీ అధ్యక్షుడు తెలంగాణ వలి, మైనార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇలియాస్, మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాబు షరీఫ్, యాసీన్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు మహమ్మద్ షబ్బీర్

ఇలా ఉంటే.. వెళ్లేది ఎలా..!

చాపాడు : మండలంలోని జడ్జిగారి కొట్టాల నుండి సిద్ధారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే దారి చాలా అధ్వాన్నంగా ఉంది. ఇలా ఉంటే.. ఎలా వెళ్లాలని ఆ గ్రామాల రైతులు వాపోతున్నారు. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి జడ్జిగారి కొట్టాల వద్ద నుంచి సిద్ధారెడ్డిపల్లి గ్రామానికి గ్రావెల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలతో అధ్వానంగా మారింది. కంకర తేలి రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3 కోట్లతో టెండర్లు కూడా ఆహ్వానించారు. అయితే కాంట్రాక్టరు పనులు ప్రారంభించేందుకు ముందుకు రాలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి పరిస్థితి. ఈ మార్గం గుండా సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, మొర్రాయిపల్లె ప్రజలు మైదు కూరు, దువ్వూరు, చింతకుంట ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ద్వారకానగరం ప్రజలు రేషన్ బియ్యం ఇతర అవసరాలకు సిద్ధారెడ్డిపల్లి పంచాయతీలోకి రావాల్సిన అవసరం ఉంది. కావున ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుంతలతో ఉన్న జడ్జిగారి కొట్టాల - సిద్ధారెడ్డిపల్లె రోడ్డు

బడుగుల ఆశాజ్యోతి పూలే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కొనియాడారు. పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజంలోని అసమానతలను తొలగించేందుకు కృషి చేశారన్నారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళోద్ధరణకు పాటుపడ్డారని ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, బిసి నేత చల్లా రాజగోపాల్ యాదవ్, పలువురు వైసిపి నాయకులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, దార్శనికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని సమ సమాజ సమితి వ్యవస్థాపకులు పాలజీ వెంకటస్వామి కొనియాడారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సమసమాజ సమితి గౌరవ అధ్యక్షులు దేవదానం, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, సభ్యులు రెడ్డితోట యోహాన్, రవి, శ్రీనివాసులు, మంత్రి శీను, బాలయ్య , గండికోట బాషా, సూరిబాబు, వై ప్రసాద్ పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలోని కులపరమైన వివక్షను, అన్యాయాలను రూపుమాపేందుకు తన జీవితాన్ని ధారపోశారన్నారు. మూఢనమ్మకాలు, కుల వ్యవస్థ, స్త్రీ అణిచివేతపై పోరాడిన మహనీయుడు అని కొనియాడారు. రమణారెడ్డి, కొండయ్య యాదవ్, ఖదీర్, నెల్సన్ కుమార్, జయచంద్ర, మద్దిలేటి, గంగన్న, రఫీ, సయ్యద్, చెన్నయ్య, శీను గౌడ్, హరి, గోపాల్, ప్రసాద్, రాజు, ఐజయ్య, దాదాపీర్, నజీర్, ఫరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు : స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, బిసిల ఆశాజ్యోతి, మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంకర్‌రెడ్డి, రామక్రిష్ణయ్య, నాగమ నాయుడు, మల్లేశ్వర్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాసులు,పెద్దన్న పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు: పూలే విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే

రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి - వేంపల్లె

సున్నా వడ్డీ పథకంపై ముఖ్యమంత్రి జగన్ ముఖారవిందంతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి ప్రసార సాధనాల్లో సుత్తి కొట్టుకోవడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'పావు కోడికి ముప్పావు మసాల' పెట్టినట్లుంది ప్రభుత్వ వాలకమని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం పెట్టిన సున్నా వడ్డీ పథకం పాతదేనని చెప్పారు. 2011 అక్టోబరు 2న కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు సకాలంలో పంట రుణాలు చెల్లిస్తే రూ.1 లక్షల వరకు సున్నా వడ్డీ పథకం, రూ.1-3 లక్షల వరకు పావలా వడ్డీ పథకం అమలు అయ్యేదని తెలిపారు. ప్రస్తుతం జగన్ పాలనలో పావలా వడ్డీ పథకం పూర్తిగా ఎత్తేశారని ఆరోపించారు. రూ.లక్ష దాటితే సున్నా వడ్డీ పథకం కూడా వర్తించడంలేదన్నారు. ఈ నిబంధనల వల్ల కేవలం 20 శాతం మంది మాత్రమే సున్నా వడ్డీ పథకం కింద లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు. జగన్ పాలనలో రైతు భరోసా కేంద్రాలు రైతు నిరాశ కేంద్రాలుగా తయారైనట్లు పేర్కొన్నారు. అట్టహాసంగా భవనాలు నిర్మించారే తప్ప అందులో కార్యకలాపాలు లేవన్నారు. ధరల స్థిరీకరణ నిధి హామీగానే మిగిలిందన్నారు. ప్రతి నియోజక వర్గంలో శీతలీకరణ గిడ్డంగి ఏర్పాటు చేస్తామన్నారే తప్ప కనీసం పులివెందుల నియోజకవర్గంలో కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. జగన్ పాలనలో రైతుల, కౌలు రైతుల ఆత్మ హత్యలు పెరిగాయన్నారు. ఇప్పటికైనా రైతుల విషయంలో వట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్టాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి : ఒఎస్‌డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పురపాలక పరిధిలోని మెయిన్ బజార్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆ మేరకు వారు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి పాడా నిధులతో చేపట్టిన కూరగాయల మార్కెట్ ఆధునీకరణ, మైత్రి లే అవుట్‌లో పార్క్, పలు పనుల పురోగతిని పరిశీలించారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు అబివృద్ధి పనులను నిత్యం పర్యవేక్షిస్తూ తగిన సూచనలు ఇస్తుండాలని వారు అధికారులను కోరారు. ముఖ్యంగా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

రాజధానిపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

- పిసిబి డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - వేముల

రాష్ట్ర రాజధాని అంశంపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని కాలుష్య నియంత్రణ మండలి బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో సోమవారం సుప్రీం కోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు సమర్థనీయమన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రం నలుదిశలా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారన్నారు. అమరావతి రాజధానిగా ఉండాలంటూ కొంతమంది గతంలో హై కోర్టుకు వెళ్లారన్నారు. రాజధానిని ఆరు నెలల్లో నిర్మించాలని, అలాగే మూడు నెలల్లో ప్లాట్లు కూడా వేసి ఇవ్వాలని హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందన్నారు. ఆరు నెలల్లో రాజధాని నిర్మించాలని హైకోర్టు సూచించడం టౌన్ ప్లానరా అంటూ సుప్రీమ్ కోర్టు ప్రశ్నించిందన్నారు. పైగా అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకృతమైతే ఎలా అని సుప్రీమ్ కోర్టు ప్రశ్నించిందన్నారు. హైకోర్టు ప్రభుత్వంలా వ్యవహరిస్తే అక్కడ క్యాబినెట్ ఎందుకని మరో మారు ప్రశ్నించిందని ఆయన వివరించారు. రాష్ట్ర అభివృద్ధి అనే అంశం ప్రభుత్వం నిర్ణయిస్తుందని సుప్రీమ్ కోర్టు చెప్పడం శుభ పరిణామమన్నారు. రాజధాని విషయంలో సుప్రీం కోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. వికేంద్రీకరణతో మూడు రాజధానుల నిర్మాణమే రాష్ట్ర అభివృద్ధికి శ్రేయస్సు అని తెలిపారు. ఇప్పటికైనా చంద్రబాబు రాజధాని అంశంపై అనవసర రాద్ధాంతం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి

మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెద్దిరాజు

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులు బాలల హక్కులతోపాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెద్దిరాజు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ హైస్కూల్‌లో జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8,9,10 తరగతి విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసిస్తూ మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులతో సమీక్ష

హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి బ్రహ్మయ్య, కమిషనర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని టిడ్కో, జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ప్రభుత్వ గృహాలకు సంబంధించి ప్రత్యేకాధికారి బ్రహ్మయ్య హౌసింగ్ సోమవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జరుగుతున్న పనులపై, మౌలిక వసతులపై ఆరా తీశారు. అప్రోచ్ రోడ్డు దెబ్బతినడంతో మెటీరియల్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని కమిషనర్ జగన్నాథ్ బ్రహ్మయ్యకు వివరించారు. జనవరికి జగనన్న కాలనీలోని అన్ని గృహాలు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శ్రీనివాసులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాషా, ఆర్ఒ గంగిరెడ్డి, మేనేజర్ పుల్లయ్య పాల్గొన్నారు.

సాహస శిక్షణ పూర్తి చేయడం సంతోషకరం

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో జాతీయ సాహస శిక్షణను విజయవంతంగా తమ కళాశాల విద్యార్థిని వెంకట దివ్య పూర్తి చేయడం సంతోషంగా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజీనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకట దివ్యను సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ సాహస శిక్షణ కార్యక్రమం ఈనెల 10వ తేదీ నుంచి 24 వరకు జరిగిందన్నారు. శిక్షణలో వెంకట దివ్య రోప్ సాయంతో పర్వత శ్రేణి నుండి కిందికి, పైకి వెళ్లిందని తెలిపారు. నది ప్రవాహన్ని దాటడం వంటి విభిన్న రకాల ప్రక్రియలో శిక్షణను విజయవంతం చేసిందని చెప్పారు. అవసరమైన సమయంలో దేశ భవిష్యత్తు కోసం ఉపయోగిస్తానని విద్యార్థి వెంకట దివ్య తెలిపారు. వెంకట దివ్యకు కళాశాల తరుపున పతకాన్ని ధరింపజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైవియు కో-ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

వేంపల్లె : వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లెలో నివసించే అనాథ వృద్ధురాలు వేముల నాగమ్మ (65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక మానవతా సేవా ఆధ్వర్యంలో ఆమెకు అంత్యక్రియలు చేపట్టారు. నాగమ్మకు బంధువులు లేరు. నాగమ్మ దహన సంస్కరణలు చేసేందుకు గ్రామంలో ఎవరూ ముందుకు రాక పోవడంతో మాజీ ఎంపిటిసి గంగరాజు సమాచారం మేరకు మానవతా సేవా సంస్థ సభ్యులు ముందుకు వచ్చారు. సంస్థ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చి పంచాయతీ సిబ్బంది సహకారంతో మానవతా రక్తనిధి డైరెక్టర్ పుల్లగూర గోవర్ధన్, సహయ కార్యదర్శి శ్రావణ్, మదార్ షా వలి, మాజీ ఎంపిటిసి గంగరాజు అంతిమ సంస్కారాలు చేపట్టారు. స్థానికులు మానవతా సభ్యులను అభినందించారు.

చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానికంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టును సోమవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కలెక్టర్ విజయ్ రామరాజు, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, జెసి సాయికాంత్ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో నాణ్యమైన, తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం వారు నగదు చెల్లించి నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, వెలుగు సమాఖ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నగదు చెల్లిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

జిఒ 52ను రద్దు చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఎస్‌టిలకు అన్యాయం చేసే జిఒ 52ను రద్దు చేయాలని ఎస్‌టి జెఎసి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు వారు పట్టణంలో సోమవారం వైఎస్ఆర్ సర్కిల్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒఎంఎస్ 52 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఆదేశించడం తగదన్నారు. ఈ ఆలోచన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చేరికను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌టిలు పోరాటాలు చేస్తారన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌టి జెఎసి నాయకులు

వేలంలో రూ.4.17 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం నిర్వహించిన టెంకాయల వేలం పాటలో రూ.4.17 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఇఒ శ్రీనివాసులు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవులు హెచ్చు పాట పాడి ఏడాదిపాటు టెంకాయల అమ్మకం చేపట్టేందుకు అనుమతి పొందారు. టిఫిన్ సెంటర్ నిర్వాహణకు వెంకటరమణ రూ.50వేలతో గదిని వేలంపాటలో పొందారు. కార్యక్రమంలో అల్లాడుపల్లె సర్పంచ్ జి.కిషోర్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

క్రైం కార్నర్

ఎర్రగుంట్లలో చోరీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక కడప రోడ్డులోని మహేశ్వర్ నగర్‌లో బోడెద్దుల మునిస్వామి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ చోటు చేసుకున్నట్లు సిఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. మునిస్వామి తన కుటుంబంతో కలిసి ప్రొద్దుటూరులోని తన బంధువుల ఇంటికి ఆదివారం సాయంత్రం వెళ్లారు. వారు మళ్లీ సోమవారం సాయంత్రం ఇంటికొచ్చి చూడగా చోరీ జరిగి నట్లు తెలిసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రధాన వాకిలి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని 5 తులాల బం గారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. విషయం తెలు సుకున్న సిఐ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు ఆధారాల కోసం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంకు సమాచారమిచ్చారు. సిఐతోపాటు మహేష్, సంజీవ రాయుడు, వార్డు మహిళా పోలీస్ భార్గవి ఉన్నారు.


దుండగులు పగులగొట్టిన బీరువా

ఇంట్లో లేనప్పుడు సమాచారమివ్వాలి : సిఐ

ఇంటికి తాళం వేసి బయటి ప్రాంతాలకు వెళ్లే వారు బంగారం, నగదు తమ వెంట తీసుకెళ్లాలని, లేకుంటే ఎన్ని రోజులు బయటికి వెళ్తున్నామనే విషయాన్ని పోలీస్‌స్టేషన్, వార్డు మహిళా కానిస్టేబుల్‌కుగానీ సమాచారమివ్వాలని సిఐ మంజునాథరెడ్డి ప్రజలకు సూచించారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

అక్రమంగా అమ్ముతున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఈశ్వరయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సిఐ వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు వేంపల్లెలోని అయా ప్రాంతాల్లో సోమవారం బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై ఎస్ఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్థానిక కాపు వీధిలో ఈశ్వరయ్య అనే వ్యక్తి బెల్టుషాపు పెట్టి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారికోర్టు ప్రొద్దుటూరు.

I.P.NO. 4/ 2020

పేరు : దత్తాత్రేయరెడ్డి. ...పిటీషనరు

వర్సెస్

మేరవ వెంకటసుబ్బయ్య మరియు 8 మంది, ఇతరులు.

...రెస్పాండెంట్లు

రెస్పాండెంటు - నెం.8కు నోటీసు

బచ్చు.కుమార్‌రాజ, తండ్రి రంగయ్యశెట్టి, C/o సుమసూపర్-మార్కెట్, Opp. పాండురంగస్వామి టెంపుల్, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు టౌన్, వైఎస్ఆర్ కడప జిల్లా.

పై ఇన్‌సాల్వెంట్ పిటిషనులో వాది అగు పేరు : దత్తాత్రేయరెడ్డి నీవు మరియు 8 మంది పైన రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఇన్‌సాల్వెంటు పిటిషను దాఖలు చేసియున్నాడు. అట్టి పిట్టిషనులో నీకు నోటీసుపై ఉత్తర్వు పంపించియున్నారు. అట్టి పిటిషనులో నీకు నోటీస్‌పై ఉత్తర్వు పంపించియున్నారు. కనుక నీవు కాని నీ తరపు వకీలు ద్వారా గాని 09.12.2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరై నీ ఆక్షేపణలు ఏమైనా ఉంటే పై కోర్టు నందు తెలుపుకోవలసినది. లేని యెడల సదరు విషయంపై మీ పరోక్షముగా తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

కె.వెంకటహరి, చల్లా రవి

అడ్వకేటు, ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE BENGALURU RURAL DISTRICT AT BENGALURU

O.S. No. 717/2022

BETWEEN: 1. Smt. Shanthamma, D/o. Late. Munishami Reddy, Aged about 54 years,
2. Smt. Gowramma D/o. Late. Munishami Reddy, Aged about 54 years,
Both are residing at Halasahalli, Thippasandra Village, Saijapura Hobli, Anekal Taluk, Bengaluru Urban District.
...Plaintiffs

AND: Sri. K.S. Suresh & others
...Defendants

SUIT SUMMONS TO DEFENDANT No. 5

Sri. Mani Kumar, S/o. S. Narasimha Rao, Aged about 50 years, Residing at No. 1/80, Main Road, Rajam Pet Post, Kadapa District, Andhra Pradesh.

Whereas, the Plaintiffs have instituted the above suit against you and others for the relief of permanent injunction. You are hereby summoned to appear before this Hon'ble Court either in person or by a pleader **on 03.01.2023 at 11.00 a.m forenoon,** to answer the same failing which the suit will be disposed in your absence.

SCHEDULE

All that piece and parcel of the land bearing Sy.No. 121/1 measuring 0-06 guntas situated at Varthur Village, Varthur Hobli, Bengaluru East Taluk, Bengaluru District and bounded on :

East by : Remaining land in same Sy.No. 121/1, **West by :** Land of Kodihalli Chinnappa, **North by :** Road in same Sy.No., **South by :** Boundary of Halasahalli Village.

Given under my hand and seal on this 28th day of November 2022 at Bengaluru.

By order of the Court, Sheristedar, Prl. Civil Judge's Court, Bangalore (R) District, Bangalore.

Advocate for Plaintiffs
G. Vishwanatha Reddy, Ravi .K,
Advocates
Office at 2nd Floor, Gopal Reddy Building, Near Manchanahalli Cross, Attibele, Bengaluru-562 107.

రక్తదానంపై ప్రజల్లో చైతన్యం పెంచుదాం

ప్రజాశక్తి - రాయచోటి

రక్తదాన విశిష్టతపై ప్రజల్లో చైతన్యం కల్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటికి చెందిన దీప బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణాలను కాపాడుతుందన్నారు. అవసరమైన వారికి సమయానికి రక్తం అందుబాటులో ఉండేలా చేద్దామన్నారు .రక్తదాన కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. రాయచోటి ప్రాంతంలో దీప బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసి సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దీప బ్లడ్ బ్యాంకు చైర్మన్ మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, జడ్పి టిసి వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, వండాడి వెంకటేశ్వర్లు, కోడి శ్రీనివాసులు రెడ్డి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు, రఘురామిరెడ్డి, సి.ఎల్.నరసింహులు, ప్రతాప్ రెడ్డి, హరినాధరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల అభ్యంతరాలు వెంటనే పరిష్కరించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న

ప్రజాశక్తి - రాయచోటి

ఓటరు జాబితాకు సంబంధించిన పెండింగ్ క్లైమ్స్, అభ్యంతరాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న పి.ఎస్. పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో కలెక్టర్ గిరీషతో కలిసి ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పిటిషన్లు పెండింగ్ లేకుండా జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. అన్నమయ్య జిల్లాలో పోలింగ్ స్టేషన్లపై ఏవైనా అభ్యంతరాలున్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టడం వల్ల ఎటువంటి బోగస్ ఓట్లు ఉండేందుకు వీలు ఉండదని పేర్కొన్నారు. అధికారులందరూ ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని పక్కాగా పకడ్బందీగా చేపట్టేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడానికి ఎవరైతే ఓటర్ కార్డు ఇస్తున్నారో వారి దగ్గర ప్రమాణీకరణ కోసం 6- బి ఫారం తీసుకుని జాగ్రత్తగా పరిశీలించి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఫామ్ 6 లో కొత్త ఓటర్లు, ఫామ్ 7 లో తొలగింపు, ఫామ్ 8 లో చిరునామా మార్పు వంటివి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అర్హులైన వారు ముఖ్యంగా 18-19 వయసులో ఉన్న యువత కొత్త ఓటర్లుగా నమోదు అయ్యేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ఓటర్ జాబితాలో ముఖ్యమైన సెలబ్రిటీలు, విఐపిలు ఉంటారని వీరి పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తగా చూడాలన్నారు. ఫామ్ 6 తక్కువగా వస్తున్నాయని వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో బిఎల్ఒల పనితీరు బావుండాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. డిసెంబర్ మాసంలో మళ్లీ జిల్లాలో పర్యటిస్తానని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో నమోదు నిమిత్తం వచ్చిన క్లైమ్స్, అభ్యంతరాలు సంబంధించి పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామని చెప్పారు. ఓటరు గుర్తింపు కార్డులకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని పక్కాగా పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీవోలు, రాయచోటి, రాజంపేట, రంగస్వామి, కోదండరామిరెడ్డి, తహశీల్దార్లు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు ప్రద్యుమ్న

మార్కెట్ యార్డు సందర్శన

జిల్లా ఎన్నికల పరిశీలకులు కలెక్టర్‌తో కలసి రాయచోటి మార్కెట్ యార్డ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మాణాలు రైతులకు సౌకర్యాల కల్పన తదితరాలను ఆయన పరిశీలించారు. రాయచోటి ప్రాంతం మామిడి పంటలకు ప్రసిద్ధి గాంచిందని, ఈ ప్రాంతంలోని మామిడి రైతుల శ్రేయస్సు కోసం రూ. 55 లక్షల రూపాయలతోతాత్కాలిక మామిడిపండ్ల షెడ్డు నిర్మిస్తామని చెప్పారు. అనంతరం మాసాపేటలోని ఓ ఇంటికి వెళ్లి నూతన ఓటర్ నమోదు గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగస్వామి, మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు, తహశీల్దార్ రవి శంకర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ మండాడి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైయస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, డిఆర్ఓ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రైతుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. లక్ష రూపాయలు పంట రుణాలు తీసుకుని సంవత్సరం కాలంలోపు తిరిగి చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తోందని చెప్పారు. ఈ వడ్డీ రాయితీ నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రబీ 2020-21వ సంవత్సరంలో లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ వడ్డీ రాయితీ అమలవుతుందని తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని 45336 మందికి వడ్డీ రాయితీ రూ.11.42 కోట్ల రైతుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. 2021 నవంబర్‌లో భారీ వర్షాల వల్ల పంట నష్టపరిహారం, వివిధ కారణాలతో జమ కాని 1330 మంది రైతులకు రూ. 89.47 లక్షను వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి రైతుల సర్వతో ముఖాభివృద్ధి కోసం పాటుపడుతున్నారని చెప్పారు. రైతుల శ్రేయస్సు కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేస్తున్నారని తెలిపారు.. కార్యక్రమం అనంతరం ముఖ్య అతిధులు రూ.12,31,40,000 మెగా చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎపిఎంఐపి పీడీ వెంకటేశ్వర రెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : 'గడికోట'

అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నిర్మాణ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఎంఎల్‌శ్రీ శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో మున్సిపల్, ప్రజారోగ్య, ఎపిఎస్‌పిడిసిఎల్, ఆర్అండ్‌బి శాఖల అధికారులతో నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పనులపై కూలంకుశంగా చర్చించారు. మండలాల వారీగా ఆయన పనుల ప్రగతిపై ఆరా తీశారు. పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ, జాతీయ రహదారిలో డివైడర్ల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, అదనపు తాగునీటి పథకాల నిర్మాణాలు, 4 పట్టణ ఆరోగ్యకేంద్రాల నిర్మాణాలు, క్రికెట్ స్టేడియం నిర్మాణాలపై ఆయన అధికారులతో చర్చించారు. ఎస్ఎన్ కాలనీలో పార్క్ పనులు, డైట్ హాస్టల్ మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులును త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అబ్బవరం ఎంఐజి లే అవుట్‌లో ఎనభై శాతం యుజిడి పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇప్పిస్తామని అధికారులుకు ఆయన వివరించారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బి శాఖ పరిధిలోని రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్అండ్‌బి ఇఇ సహదేవరెడ్డికి ఎంఎల్ఎ సూచించారు. ఎండపల్లె, గుంటిమడుగుగు, దానంరెడ్డిగారిపల్లె, మాధవరం, కోనంపేట- గాలివీడు రోడ్డు, కలిబండ రోడ్డు , పెండింగ్‌లో ఉన్న గాలివీడు నాలుగు లైన్ల విస్తరణ, గాలివీడు-నూలివీడు రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. గుణ్ణికుంట్ల రహదారి సుందరీకరణ పనులు, కలెక్టరేట్ సమీపంలో నిర్మిస్తున్న జిల్లా గెస్ట్ హౌస్ నిర్మాణ పనులపై ఆయన సమీక్షించారు. ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి నిధులు అందిస్తుందని, నియోజక వర్గంలో ప్రతి రహదారిని సుందరంగా తీర్చిదిద్దుకుందామని అధికారులుకు తెలిపారు.

'ఆశా'లపై ప్రభుత్వాల నిర్లక్ష్యం : 'సిటు'

సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.జయమ్మ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. వేతనాలు, బడ్జెట్ పెంచాలని కోరారు. జిల్లాలోని 47 పిహెచ్‌సిలలో ఎఎన్ఎం, ఎంఎల్‌పిహెచ్‌లు ఆశావర్కర్లను వేధింపులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. వారి సొంత పనులు చేయకపోతే విధులకు సక్రమంగా రాలేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసి మానసికంగా హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెయ్యి మంది జనాభాకు ఒక ఆశాకర్యర్తను నియామించాల్సిందని పోయి మూడు, నాలుగు వేల జనాభాకు ఒకరిని నియమించి తీవ్ర పనిభారం పెంచుతున్నారని వాపోయారు. జిల్లాలోని స్థానిక సమస్యలు పరిష్కారానికి అధికారులకు, ఆశాలకు తమ సంఘం తరపున జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సిఐటియు జిల్లా కన్వీనర్ ఏ. రామాంజులు మట్లాడుతూ రిటైర్ అయిన, చనిపోయిన ఆశాల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాని డిమాండ్ చేశారు. రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ సౌకర్యం రూ. 3లక్షలు ఇవ్వాలని తెలిపారు. మహిళా ఉద్యోగ ప్రసూతి సెలవుకు నోచుకోక వేతనం కోల్పోతున్నారని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతపత్రాన్ని డిఎంహెచ్ఒ కార్యాలయ సూపరింటెండెంట్ పల్లమరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.మేహరజ్ ఉన్నిశా నాయకులుఆదిలక్ష్మి, రెడ్డెమ్మ, మహభూబ్ జాన్, లావణ్య, భవిత పాల్గొన్నారు.

హెలీప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన నాలుగో విడత కార్యక్రమానికి ఈ నెల 30న అన్నమయ్య జిల్లా, మదనపల్లి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో సోమవారం బిటి కళాశాల గ్రౌండ్‌లోని హెలిప్యాడ్‌ను కలెక్టర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, జెసి తమీమ్ అన్సారియా పరిశీలించారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి బెంగళూరు రోడ్డు మీదుగా అనిబిసెంట్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కదిరి రోడ్డు మీదుగా టిప్పు సుల్తాన్ గ్రౌండ్ వరకు సిఎం వెళ్లే మార్గాన్ని తనిఖీ చేశారు. ఎఎస్ఎల్‌లో ఏర్పాటు బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు పరిశీలించారు. బారికేడ్లు, సేఫ్ రూమ్, తదితర ప్రాంతాల్లో తిరిగారు. పర్యటనలో ఎటువంటి పొరపాటు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల పరిధిలో వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లి మున్సిపల్ చైర్మన్ మనుజారెడ్డి, ఎపిఎండిసి చైర్ పర్సన్ షమీం అస్లాం, ఆర్‌డిఒ మురళీ, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గిరీష

మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధే సిఎం ధ్యేయం

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక శ్రీ పట్టాభిరామాలయ సమీపంలో వైఎస్సార్ క్రాంతి పథం కింద సంఘ సభ్యుల భాగస్వామ్యంతో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి చేయూత మార్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ మహిత, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ కిషోర్, డిపియం వెంకట్రమణ, ఏరియా కో-ఆర్డినేటర్ రూతు, ఎపిఎం నరసింహులు, సర్పంచ్ గంగులమ్మ, వైసిపి నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

బస్సులను ప్రారంభించిన చైర్మన్

ప్రజాశక్తి- కడప అర్బన్

విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్తగా ఆర్టీసీ స్టార్ లైనర్ బస్సులను కడప ఆర్టీసి డిపోలో సోమవారం ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ స్టార్ స్లీపర్ బస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. త్వరలో ఏసీ స్లీపర్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో

మేఘన ప్రతిభ

ట్రోఫీ అందుకుంటున్న మేఘన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని సుంకు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువు తున్న ఎన్.మేఘన అనే విద్యార్థిని ఈనెల 26,27 తేదీలలో కర్నూలులో నిర్వ హించిన నేషనల్ లెవల్ ఉడ్‌బాల్ చాంపియన్ షిప్ టోర్నమెంటులో ప్రతిభ కనబరిచి సింగిల్స్ విజేతగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థిని విజేతగా నిలిచి కర్నూలు కౌన్సిలర్ కె.వి.పద్మలతారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ, మెడల్ అందుకున్నారని చెప్పారు. విద్యార్థిని గతంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఎంపికై మన రాష్ట్రం తరపున పాల్గొ న్నారని తెలిపారు. మేఘన బీరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొని అనేక మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల, స్కూల్ టీచర్లు, కళాశాల అధ్యాపకులు, కోచ్‌లు మహేంద్ర నాయక్, శరత్‌నాయక్ ప్రోత్సాహంతో అద్భుత విజయాలను సాధించారని కితాబునిచ్చారు. మేఘన ఉడ్ బాల్ ఆటలోనేగాక ఖోఖో,రోప్, స్కిప్పింగ్, కొన్ని అథ్లెటిక్ లోనూ రాణిస్తున్నారని చెప్పారు. విద్యార్థి వివిధ క్రీడల్లో ఉన్నత శిఖరా లను అధిరోహించాలని ఆకాంక్షించారు. విజేతగా నిలిచిన విద్యార్థిని మేఘనను సుంకు కళాశాల ప్రిన్సిపాల్ ,అధ్యాపకులు, ,విద్యార్థులు అభినందించారు.

అదనపు భవనానికి భూమిపూజ చేస్తున్న ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి

రూ. 24 లక్షల వ్యయంతో భూమిపూజ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

'ఉరుస్తున్న పాఠశాల-ఇబ్బందులు విద్యార్థులు' అనే శీర్షికతో ఈ నెలలో ప్రచురించిన కథనానికి స్పందించిన ఎంపిపి జల్లా సుదర్శన్‌రెడ్డి సిసిపల్లె ప్రాథమిక పాఠశాల భవనాన్ని చదును చేసి రూ.24 లక్షల వ్యయంతో నిర్మించబోయే అదనపు భవనానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రం వాండ్లపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని రూ.12.50 లక్షలతో భూమిపూజ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద ప్రహరీ, వంట గదిని ఏర్పాటు చేస్తా మన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్ నాయక్ గ్రామ సర్పంచ్ కమలమ్మ, కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-రామాపురం

అండర్-17 త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని నీలకంఠరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో బి. శివ నాగేంద్ర, విష్ణు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని పది నియోజకవర్గాల పాఠ శాలల నుంచి అత్యంత ప్రతిభ కనబరిచిన12మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడాపోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికవ్వడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. **గాలివీడు :** త్రోబాల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎగువగొట్టివీడు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఎగువగొట్టివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎబిఎంహెచ్ మైదానంలో నిర్వహించిన త్రోబాల్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల నుంచి అండర్-17 విభాగంలో కె.శ్రావణి, ఫస్ట్ స్టాండ్ బైలో, బి.రాంచరణ్, అండర్-14 విభాగంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న పి.రామ్మోహన్ నాయుడు, ఎన్. తేజేశ్వర్ నాయుడు, ఎం. పండు నాయుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సహ ప్రధానోపాధ్యాయులు శివారెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలివీడు: ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది

'స్పందన' కరువు

ఏ సమస్యా పరిష్కారం కాలేదు- అర్జీదారులకు వ్యయప్రయాసే

ప్రజాశక్తి -ఓబులవారిపల్లి

మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారుల నుంచి ఎలాంటి స్పందన లభించడం లేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల నుంచి వివిధ సమస్యలతో వ్యయప్రయాసాల కోర్చి వస్తున్న ప్రజలకు పరిష్కారం లభించడం లేదు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమం పేరుకే తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు విన్నవించుకుందామనుకుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాళ్లు అరిగేలా ప్రతి సోమవారమూ కార్యాలయం చుట్టూ తిరిగినా తమ గోడు వినేవారు లేదని పేర్కొన్నారు. మండలంలో భూ సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. బాధితులు తమ భూ సమస్యలు పరిష్కంచాలని వేడుకుంటున్నా కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. స్పందన కార్యక్రమానికి అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఉన్నతాధికారులు ఒకవైపు ఆదేశాలు జారీ చేస్తున్నా.. వాస్తవానికి కార్యాలయంలో పూర్తి విరుద్ధంగా ఉంది. చివరకు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అర్జీదారులు వెనుదిరిగి వెళ్తుండడం గమనార్హం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పందనకు అధికారులందరూ హాజరై బాధితుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

భూమి ఆన్‌లైన్ చేయలేదు

ఈ నెల 4న స్పందనలో భూమిని నా పేరుమీద ఆన్‌లైన్ చేయాలని తహశీల్దార్ కార్యాలయంలో అర్జీ ఇచ్చాను. ఇంతవరకూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్నిసార్లు వారిని అడిగినా చూద్దాంలే.. చేద్దాంలే అని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ వాయిదా వేస్తున్నారు. ఇప్పటికైనా తహశీల్దార్ స్పందించి భూమిని ఆన్‌లైన్ చేయాలి.

- హుసేన్‌సాహెబ్, ఓబులవారిపల్లె.

రేపు జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి

ఏపీ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 30వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లాస్థాయి పోటీలు రాయచోటి డైట్ ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించనున్నట్లు డిఇఒ రాఘవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనే అంశంపై విద్యార్థులు తమ ప్రాజెక్ట్ రికార్డ్, లాగ్ బుక్, సర్వే బుక్, 4 చార్టులతో రావాలని సూచించారు. ఒక ప్రాజెక్ట్ కు ఒక గైడ్ టీచర్, ఒక విద్యార్థి మాత్రమే హాజరవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9705488280లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అఖిలేష్‌రెడ్డి హఠాన్మరణం బాధాకరం

ప్రజాశక్తి - రాయచోటి

సంబేపల్లె మండలం గురిగింజకుంట పంచాయతీ కార్యదర్శి అఖిలేష్ రెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం బాధాకరమని సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన అఖిలేష్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతిపట్ల సంతాపం తెలిపారు. అఖిలేష్ తండ్రి సంబేపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకట రమణారెడ్డిని, కుటుంభ సభ్యులను ప్రసాద్ బాబు ఓదార్చారు. అయన వెంట టిడిపి నాయకులు మన్నేరు రామాంజనేయులు ఉన్నారు.

గ్రామాభివృద్దే లక్ష్యం : ఎపిఒ

వెంగంవారిపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న ఎపిఒ రమేష్

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

గ్రామాలను అభివద్ధి చేయడమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య లక్ష్యమని ఎపిఒ రమేష్ తెలిపారు. సోమవారం వెంగంవారి పల్లి సచివాలయంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి 'పనుల గుర్తింపుప్రణాళిక ప్రక్రియ' అనే కార్యక్రమం పై గ్రామ సభను నిర్వహించారు. ఈనెల 24 నుండి 28వ తేది వరకు అగ్రహారం, సామకోటవారి పల్లి, నిమ్మనపల్లి, వెంగంవారి పల్లి, తవళం, కొండయ్యగారి పల్లి, ముష్టూరు, బండ్లపై, రెడ్డివారి పల్లి, రాచవేటివారి పల్లి గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించి, క్షేత్రస్థాయి సిబ్బంది ఇదివరకే గుర్తించిన పనులను సర్పంచులు, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో పనులను ఆమోదించడం జరిగిందన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలను కల్పించడానికి ప్రణాళికలను రూపొందించామన్నారు. జాబ్ కార్డులు లేని కూలీలకు జాబ్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. పండ్ల తోటలను, పూల తోటలను సాగు చేయు రైతులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీవాణినవీన్, పంచాయతీకార్యదర్శి వెంకటర మణారెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

కర్రసాము నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కర్రసాము నూతన కార్యవర్గ సభ్యులు

జిల్లా కర్రసాము నూతన కార్యవర్గాన్ని శ్రీకాళ హస్తిలో రాష్ట్ర అధ్యక్షులు పి.విజయ్‌కుమార్, చైర్మన్ శ్రీనివాసులు, కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్ను కున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్, ఉపాధ్యక్షులుగా బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, సంయుక్త కార్యదర్శులు కె.నాగరాజా, ఎ.ఉమా శంకర్, కోశాధికారి అయ్యపురాజు చంద్ర, గౌరవ సలహాదారులు టి.చంద్రశేఖర్, వి.నరసింహులు, కార్యవర్గసభ్యులుగా బి.సుధాకర్, కె.గంగారామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

యువజనోత్సవాల్లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ

యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్.వి.యూనివర్సిటి యువజన ఉత్సవాల్లో మదనపల్లి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక నత్యపోటీలలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఇంటర్ కొల్జియేట్ క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించారని అన్నారు. నత్య పోటీల్లో కూడా ప్రతిభ కనబరచడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. నత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, డాన్స్ మాస్టర్ సురేష్ అభినందించారు.

అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

అంగన్వాడీ కేంద్రంలో భోజనాన్ని పరిశీలిస్తున్న సిడిపిఒ రాజేశ్వరి

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి హరిజనవాడ, ఆర్.వడ్డిపల్లి అంగన్వాడీ పాఠశాలను సోమవారం రైల్వేకోడూరు ప్రాజెక్ట్ సిడిపిఒ రాజేశ్వరి ఆకస్మిక తనిఖీ చేశారు.ఆయాపాఠశాలలోని పిల్ల లహాజర పట్టికను, పలు రికార్డు లను ఆమె పరిశీలించారు. పిల్లలకి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఆమె టీచర్లకు సూచించారు. టీచరు,ఆయా ఇద్దరూ ప్రతి పాఠశాలలో సమన్వయంతో పని చేసుకోవాలని, లేనియెడల వారిని వేరే పాఠశాలకు బదిలీ చేస్తామని తెలిపారు. ఉదయం9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది పాఠశాలల్లో ఉండాలనిచెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మనెమ్మ, సిఐటియు మండల అధ్యక్షురాలు డి.వనజకుమారి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పవన్‌ను కలిసిన జనసేన నాయకుడు

ప్రజాశక్తి-నందలూరు

పవన్ కళ్యాణ్‌ను కలిసిన గురివిగారి వాసు

జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ఉమ్మడి కడపజిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు గురివిగారి వాసు సోమవారం మంగళగిరి జనసేన పార్టీ ఆఫీసులో కలిశారు. గతసంవత్సరం అన్నమయ్య డ్యామ్ వరదల్లో తోగురుపేట, మందపల్లి, పుల్లపతూరు, గుండ్లూరు ప్రాంతాలే కాకుండా నందలూరు మండలంలోని పాటూరు, నీలిపల్లి, గొల్లపల్లి, నందలూరు ఎస్‌సి కాలనీ, ఏటి పరివాహక ప్రాంతాలు చాలానే నష్టపోయాయని పవన్ దృష్టికి తీసుకపోయారు. పాటూరులో బిసి కాలనీలో మహిళ వరద ధాటికి కొట్టుకుపోయి ఒక చెట్టుని పట్టుకొని ప్రాణాలతో బయటపడిందని, గృహాలు దెబ్బతిన్నాయని, పంట నష్టం భారీగా సంభవించిదన్నారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవడంలో విఫలమైందని పవన్‌కు వివరించినట్లు తెలిపారు. త్వరలో వరద ప్రభావిత ప్రాంతాలు ఆయనే స్వయంగా పర్యటించి ప్రభుత్వ హామీలు ఎంతవరకు నెరవేర్చారో తెలుసుకుంటారని చెప్పారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

వేరుశనగ విత్తనాలు తీసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి -కలకడ

సంబేపల్లి మండలం గుట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో సోమవారం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు చిదంబర రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయించిన ధరల ప్రకారం రైతులకు విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వేరుశన విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు ,పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకొని వచ్చి సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎ రజిత, రైతులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన అవసరం

పీలేరు :కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడంలో భార్యతో పాటు భర్త కూడా భాగస్వాములై ఆనందమయ దాంపత్యాన్ని పొందాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. సోమవారంఅడవిపల్లి గ్రామంలో కుటుంబ నియంత్రణ-పురుషులభాగస్వామ్యం అనే అంశముపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పునరుత్పత్తికి సరియైన ప్రణాళికతో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకొని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ వెంకటసుబ్బమ్మ,ఏఎన్ఎంఫామున్నిసా,నాగవేణి, ఆశాలు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భారతీయ అంబేద్కర్ సేనసభ్యులు

జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైసిపి నాయకులు జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిబాపూలే మహిళా విద్యాభివద్ధికి ఎంతగానో కషి చేశారని అన్నారు. ఆయన నిత్య స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చిదానంద గౌడ్, అన్నమయ్య జిల్లా బిసి సెల్ అధ్యక్షులు, రాజంపేట పట్టణ కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, కో-ఆప్షన్ సభ్యులు రాము యాదవ్, వైసిపి పట్టణ అధ్యక్షులు కష్టూరావు, వీరబల్లి జెడ్పిటిసి శివరాం గౌడ్, రాజంపేట ఏరియా ఆసుపత్రి మాజీ చైర్మన్ వడ్డే రమణ, రాష్ట్ర బిసి కార్యదర్శి మనుబోలు వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **బికొత్తకోట:** స్థానిక ఎంపిడిఓ భవనంలో అధికారులు జ్యోతిరావుపూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ అధికారులు మస్తాన్, ఏఓ థామస్ రాజ్, మహేంద్ర, ప్రతాప్, కుమార్, సచివాలయపు ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ మన్సూర్, అలేఖ్య, గాయత్రి, సచిన్, నక్కామహేష్, రమణ, చంద్ర, పుణ్యవతి పాల్గొన్నారు. **మదనపల్లె :** స్థానిక భారతీయ అంబేద్కర్ సేన కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కన్వీనర్ , వికెసి పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, తలారికష్ణ, గంగాధర్, తెట్టుశ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, గంపలరమణ, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, హైదరవల్లి, షేక్ పాల్గొన్నారు. **బిసిహెచ్‌సిఎస్ ఆధ్వర్యంలో..** స్థానిక నీరుగట్టు వారి పల్లెలో బిసిహెచ్‌సిఎస్ అధ్యక్షులు బోడెం రాజశేఖర్ తమ కార్యాలయంలో ఘనంగా మహాత్మా పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో బిసిహెచ్పిఎస్ నాయకులు రామలింగయ్య, హరినాద్, మక్కి నేని వేణుగోపాల్, బండి రామచంద్ర, రాఘవేంద్ర యాదవ్, గురుమూర్తి, నరవుల మని శంకర్, చలపతి, లక్ష్మన్న, నాగినేని గొవిందు, విజయ్ కుమార్, చంద్రయ్య, శ్రీనివాసులు, నాగరాజుతో పాటు పలువురు బిసిహెచ్‌సిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** ఎంపిడివో కార్యాలయంలో జ్యోతికరావుపూలే చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అభివద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డిమాల్ రెడ్డి, సర్పంచులు, పద్మనాభ రెడ్డి, భాస్కర్, తాళ్ల చంద్రశేఖర్, శివారెడ్డి, రామ్మూర్తి, కోటిరెడ్డిలు పాల్గొన్నారు. **నందలూరు:** రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు తాటి సుబ్బరాయుడు, మాజీ ఎంపిటిసి తాటి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఆర్ఎస్ రోడ్డులో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళలర్పించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, కుర్రామణి యాదవ్, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య, హర్షవర్ధన్ పాల్గొన్నారు. **టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు (గుట్టబాబు) ఆధ్వర్యంలో** సోమవారం పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే 132 వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక నేతలతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష, మాజీ జడ్‌పిటిసి నరసారెడ్డి, రాయచోటి రూరల్ మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జి మహాదేవపల్లి వెంకట రమణ రెడ్డి, శెట్టిపల్లి నాగార్జునరెడ్డి, జాతీయ బిసి సంక్షేమ సంఘము రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి కుర్రపోతుల శివశంకర్, అబ్బవరం రెడ్డి కుమార్, మాధవరం శబరీష్, అవులవాండ్లపల్లి శ్రీనివాసులు, బాషా, సైకం విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండల కేంద్రంలో మహాత్మ జ్యో రావు పూలే 132వ వర్ధంతి సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి ఓబులేష్, బీసీ సంక్షేమ సంఘం, మాల మహనాడు నాయుకులు కె.వి. రమణయ్య ,డివి రమణయ్య, ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న జ్యోతిరావు పూల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయుకులు కుళాయిప్ప, వెంకటేష్ ఆచారి, డేరింగుల వెంకటేష్,గిరి చంద్రశేఖర్, గువ్వా రామాంజులు, హరి, ఓబులేసు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీహరి, రమాదేవి, భారతి, మదనయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** బిసి నాయకులు విజయభాస్కర్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంపీ డాక్టర్ కష్ణయ్య, జయచంద్ర నాయుడు, రెడ్డయ్య, రామచంద్రయ్య, సురేష్ బాబు, గిరి వర్ధన్, వెంకటాద్రి, సోమశేఖర్, రమణ పాల్గొన్నారు. **కలికిరి:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకుడు మలతోటి నరేష్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 132 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

ముఖ్యమంత్రి బహిరంగ సభకు తరలిరండి

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

- ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- ములకలచెరువు

ఈ నెల 30న మదనపల్లిలో జరిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభను విజయవంతం చేద్దఆమని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ములకలచెరువు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలోములకలచెరువు మండలంలోని ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అదిస్తున్నామని తెలిపారు. మండలం నుండి ముఖ్యమంత్రి బహిరంగ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛదంగా సభకు వచ్చే వారిని వైసిపి నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి సాయి లీల ఉమా మహేష్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచులు జయచంద్రకుమార్, రాంబాబు, సుదర్శన్ రెడ్డి, కేశవరెడ్డి, రెడ్డప్ప, చక్రపాణి నాయుడు, చిన్న మేకల వెంకటరమణారెడ్డి నాయకులు మల్లికార్జున రెడ్డి, రమణారెడ్డి, రెడ్డప్ప రెడ్డి పాల్గొన్నారు.

'ఇదేంఖర్మ'ను విజయవంతం చేయాలి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -కలికిరి

సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

డిసెంబర్ 2వతేది నుండి నిర్వహించే రాష్ట్రానికి ఇదేంఖర్మ కార్యక్రమంలో నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నగిరిపల్లిలోని తన నివాసంలో నియోజవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టే రాష్ట్రానికి ఇదేంఖర్మ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లోనూ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలన గురించి వివరించాలని తెలిపారు. ఓటు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, యువత ఓటునమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మద్దిపట్ల సూర్య ప్రకాష్, తెలుగు రైతు అధ్యక్షుడు రవి ప్రకాష్ నాయుడు, రాజంపేట అధికార ప్రతినిధి కోటపల్లి బాబు, మల్లెలరెడ్డి భాష, ఆరుమండలాల టిడిపి పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంకల్ప రెస్టారెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -బి.కొత్తకోట

రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

బి.కొత్తకోట పట్టణం బెంగళూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన సంకల్ప రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెస్టారెంట్‌కి వచ్చే వారికి రుచి, శుచికరమైన వంటకాలు వడ్డించి అందరి మన్ననలు చూరగొనాలన్నారు. సంకల్ప రెస్టారెంట్ నిర్వాహకులు నిఖిల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేతో రెస్టారెంట్‌నను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. శాఖాహార, మాంసాహార ప్రియులకు తమ రెస్టారెంట్ నందు పలు రకాల వంటకాలు అందు బాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కష్ణారెడ్డి,కేశవరెడ్డి, కంచికళ్యాణ్, కుమార్ రెడ్డి, కంచి బలరాం రెడ్డి, కంచి కోదండ, అభిలాష్ రెడ్డి, లోకేష్ రెడ్డి,విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి- లక్కిరెడ్డిపల్లి

రాయచోటి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోషకాహారం పంపిణీ చేశారు. టిబి రోగులకు ఈ పౌష్టికాహారం విలువ ఒక్కొక్క ప్యాకెట్ రూ.700 చొప్పున 10 మంది రోగులకు అందజేసినట్టు అధ్యక్షుడు మహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో అశోక్ కుమార్ , డాక్టర్లు కీర్తి రెడ్డి డాక్టర్లు లైన్స్ క్లబ్బు నేతలు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి టీవీ యూనిట్ సూపర్వైజర్ హరి ఆసుపత్రి పాల్గొన్నారు

నాడు-నేడు పనులకు భూమిపూజ

నాడు-నేడు పనులకు భూమిపూజ చేస్తున్న మేడా విజయభాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు రెండవ విడత పనులకు ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులలో భాగంగా పది రకాల ప్రత్యేక వసతులను కల్పి స్తుందని అన్నారు. అందులో భాగంగా 22 లక్షల రూపాయలతో రెండు అదనపు గదులను విద్యార్థుల కోసం పాఠశాలలో నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు వినియో గించుకొని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు గంగిరెడ్డి, ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అల్లం అశోక్ కుమార్, వైసిపి మండల నాయకులు గడికోట వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకులు నడివీధి సుధాకర్, వర్క్స్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, వైసిపినాయకులు సుబ్బరామిరెడ్డి, నూకనాగేశ్వర్ రెడ్డి, చొప్పనరసింహారెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PILER
H.M.O.P.NO. 41 OF 2022

B. Nagaraja. **...Petitioner**

Vs

Maluri @ Boggala Nagaraja. **...Respondent**

NOTICE TO RESPONDENT

Smt Mailuri @ Boggala Nagarathna Wife of Boggala Nagaraja, Kuravapalli, T.Rachapalli Post, Gurramkonda Mandal, Annamayya District.
Madam,

Please take notice that above petition filed by the petitioner against you for decree of divorce and the same is stands posted to 09-12-2022. Hence you are hereby notice that you shall appear before the Honorable SeniorCivil Judge's Court, Piler on 09-12-2022 at 10.30 a.m. either in person or through counsel and file your objections if any, otherwise, the matter will be decided in accordance with law.

VALLEPU CHINNA REDDEPPA, B.A., B.L.,
M. HYMAVATHI, B.A., B.L.,
Advocates, PILERU.
CELL No. 9440540769

సమస్యలు పరిష్కరించండి

సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్:

సౌత్‌సెంట్రల్ రైల్వేజనరల్ మేనేజర్ ఎ.కె.జైన్ మంగళవారం రాజంపేటకు రానున్న నేపథ్యంలో రాజం పేట లోని రైల్వే ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లాకార్య దర్శి చిట్వేలి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ కేంద్రమైన రాజంపేటలో కరోనాకు ముందు అనేక రైళ్లస్టాపింగ్ ఉండేవని, ప్రయాణికులు సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకునే వారన్నారు. కరోనా తీవ్రత ఉన్న సమయంలో అనేక రైళ్ల స్టాపింగ్‌ను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరోనా తరువాత నిలిపి వేసిన రైళ్ల స్టాపింగ్ లను పునరుద్ధరించడంతో పాటు రాజంపేట రైల్వే స్టేషన్ మీదుగా వెళ్ళే రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాజంపేటలో ఔరంగాబాద్ - చెన్నై ఎక్స్ ప్రెస్ (20954), ముంబై - చెన్నై (22157), నిజాముద్దీన్ - తిరుపతి (12780), నాగర్ కోయిల్ (16351), ఎక్తానగర్ - చెన్నై (20920), వాస్కోడిగామా-తిరుపతి (17420), ఔరంగాబాద్ - రేణిగుంట (17621), కాచిగూడ - మంగళూరు ఎక్స్ ప్రెస్ (12789), హుబ్లీ - చెన్నై (17313), ఎల్ టీటీ ముంబై - చెన్నై (22719), హరిప్రియ ఎక్స్ ప్రెస్ (17416) రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తే ఇక్కడి ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. దివ్యాంగ ప్రయాణికుల సౌకర్యార్థం డిసెబుల్ పాత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకటి, రెండవ ప్లాట్ ఫాంలలో పైకప్పు పూర్తిగా లేక పోవడంతో వర్షం కురిసినప్పుడు ప్రయాణికులు తడుస్తూ ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. పై సమస్యలతో పాటు అసంపూర్తిగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణపనులు త్వరితగతిన పూర్తయ్యేలా గట్టి చర్యలు తీసుకోవాలని రవికుమార్ కోరారు.

ఎమ్మెల్యే సోదరునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయు డు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై హత్యారాజకీ యాల ను ప్రోత్స హించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని నిమ్మనపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు చిన్నబాబు, రాజంపేట పార్లమెంటు టిడిపి ఎస్‌సిసెల్ కార్యదర్శి విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ముద్దుశీనుకు ఆనాడు వై.యస్.రాజశేఖర్ రెడ్డి ఒక్క మాట చెప్పి ఉంటే చంద్రబాబును ఇంట్లోనే చంపేసేవాడని వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను టిడిపి కార్యకార్తలు ప్రశ్నిస్తే వైసిపి వర్గీయులు రాద్దాంతం చేసి దాడులు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకునిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రశేఖర్ రెడ్డి పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.వెంటనే తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి- కలకడ

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన సంఘటన సంబేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గురిగింజ కుంట పంచాయతీ సచివాలయంలో ఎన్.అభిషేక్ రెడ్డి (31) గత కొంతకాలంగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధి నిర్వహణలో ఉన్నసమయంలో చాతిలో నొప్పి రావడంతో రాయచోటి వైద్యశాల తరలించి చికిత్స చేయించారు. అధిక గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న డిఎల్‌పిఒ సిహెచ్.నారాయణ సిబ్బందితో వెళ్లి మృతి చెందిన అభిషేక్ రెడ్డికి సంతాపం వ్యక్తం చేశారు.మృతుడు అభిషేక్‌రెడ్డికి11 నెలల క్రితం వివాహం అయిందని, ప్రభుత్వ వారి కుటుంబానికి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - కలికిరి

ఇటీవల నూతనంగా నిర్మించిన అంకాలమ్మ కళ్యాణ మండపాన్ని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నందరి కిషోర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. కలికిరి మండలం పతేగడ గ్రామం, కూచంవారి పల్లి నందు గల ప్రసిద్ధి కాంచిన అంకాలమ్మ దేవస్థానము అభివద్ధి కొరకు కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 300 కోట్లు నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా గుడికి అనుబంధంగా నిర్మించబడిన అంకాలమ్మ కళ్యాణ మండపంను కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ మల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అంకాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం అంకాలమ్మ కళ్యాణమండపాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు మెంబర్లు మరియు కుచంవారి పల్లి, పాలెం, పతెగడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న యోగేశ్వర్ రెడ్డి

తాళ్లపాకలోని సచి వాలయంలో ఏర్పా టుచే సిన ఆధార్ కేంద్రాన్ని సద్విని యోగం చేసు కోవాలని వైసిపి నాయ కులు పి.సి యోగేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం తాళ్లపాక సర్పంచ్ గౌరీ శంకర్, మధుసూదన్ రెడ్డి, బాలరాజు శేఖర్ రాజులుతో కలసి ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 2011-17 మధ్యలో ఆధార్ పొందిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులందరికీ ఆధార్ తో మొబైల్ అనుసంధానం తప్పనిసరి అయినందున తాళ్లపాక ప్రజలు చిరునామా మార్పు, పింఛను పొందడానికి వేలిముద్రలు పడని వృద్ధులు, పట్టణంలో గల ఆధార్ కేంద్రాలు, బ్యాంకులు, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఆధార్ కేంద్రం ఏర్పాటుకు కషిచేసిన శాసన సభ్యులు మేడా మల్లిఖార్జున రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పీలేరు

రైలు ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. తిరుపతి నుంచి హైదరాబాదు వెళు తున్న సెవెన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్ సోమవారం సాయంత్రం పీలేరు రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో యువకుడిని ఢీకొంది. ఈ ఘటనలో అతను ప్రమాదవస్థలంలోని మృతి చెందాడు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడి ఆచూకి తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-పీలేరు

మృతి చెందిన రవీంద్ర

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరులో చోటు చేసు కుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా, సదుంమండలం, చింతలవారిపల్లి పంచా యితీ, తమటంవారిపల్లికి చెందిన ఓర్సు రవీంద్ర (30) కంప్యూటర్ హార్డ్వేర్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం చీకటి పడ్డాక స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఇంటి నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తూ, ప్రమాదవశాత్తు పైనున్న 11కెవి విద్యుత్ తీగ తాకిన ఘటనలో కింద పడ్డాడు. అక్కడి స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. మతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఎస్ఐ నరసింహుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.